గడప వద్దకే ప్రభుత్వ పథకాలు

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు


పెజ్జోనిపేటలో స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి, నాయకులు

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా గడప వద్దకే ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం 35వ డివిజన్ 221వ సచివాలయం పరిధిలోని పెజ్జోనిపేటలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. డివిజన్‌లోని ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత మూడున్నర ఏళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. అర్హులైన వారికి పథకాలు అందకపోతే సచివాలయంలో సంప్రదించాలని సూచించారు. వలంటీర్ల ద్వారా అర్హులందరికీ ప్రతి పథకం అందేలా చూస్తున్నామన్నారు. డివిజన్‌లో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని, రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేశామన్నారు. చిన్న చిన్న సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి లేదా కార్పొరేటర్ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తారని తెలిపారు.

యువశక్తి కాదు.. నారాశక్తి

జనసేనకు, టీడీపీకి రాష్ట్రంలో స్థానం లేదని వారు ఒంటరిగా పోటీ చేసి గెలిచే ధైర్యం లేదని ఎమ్మెల్యే వెలంపల్లి ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలు ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజలు వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారన్నారు. పవన్‌కళ్యాణ్ నిర్వహించేది యువశక్తి కాదని నారాశక్తి అని దుయ్యబట్టారు. జనసేనా నాయకుడికి ఒక విజన్ లేదన్నారు. మిడిమిడి జ్ఞానంతో మాట్లాడటం తప్పా, ఆయనకు ఆ పార్టీనీ నడిపించే లక్షణాలు, ధైర్యం లేవన్నారు. అందుకే పొత్తుల కోసం వెంపర్లడుతున్నాడని ధ్వజమెత్తారు. ఎవరు ఎన్ని పొత్తులు పెట్టుకున్న తమ పార్టీ ఒంటరిగా ఎదుర్కొంటుందని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు బలసాని కిరణ్, పాలిమెట్ల శరత్‌బాబు, సంగీత్‌బాబు, సుజాత, నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కళ్యే లలిత విగ్రహావిష్కరణ



విజయవాడ స్పోర్ట్స్: నగర ప్రముఖురాలు కళ్యే లలిత ప్రథమ వర్ధంతిని సింగ్‌నగర్‌లో గురువారం నిర్వహించారు. కళ్యే లలిత విగ్రహాన్ని ఆమె భర్త నాగేశ్వరరావు ఏర్పాటు చేశారు. వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న లలిత స్నేహితురాలు బి.భూలక్ష్మి చేతుల మీదుగా విగ్రహాన్ని ప్రారంభించారు. మంచికి, స్నేహానికి మారుపేరుగా లలిత ఉండేదని ఆమె స్నేహితురాళ్లు, బంధువులు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో లలిత కుమార్తెలు సీతామహాలక్ష్మి, జయదుర్గ, మేఘవాణి, అల్లుళ్లు హరీష్, కిరణ్‌కుమార్, నూతన్‌కుమార్, పలువురు నగర ప్రముఖులు పాల్గొన్నారు.

సోనోవిజన్‌లో టీసీఎల్ గూగుల్ టీవీ ఆవిష్కరణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టీసీఎల్ తమ వినియోగదారుల కోసం మార్కెట్‌లోకి తీసుకువచ్చిన సరికొత్త గూగుల్ టీవీని సోనోవిజన్ ఎండీ భాస్కరమూర్తి ఆవిష్కరించారు. ఏలూరు రోడ్డులోని సోనోవిజన్ విజయప్లాజాలో గురువారం టీవీని ఆవిష్కరించారు. కంపెనీ ప్రతినిధులు గూగుల్ టీవీ ఫీచర్స్‌ను వివరించారు. గూగుల్ టీవీ 32 అంగుళాలు, 43, 55, 65, 75 అంగుళాలు ఆపై సైజుల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, మార్కెటింగ్ మేనేజర్ శ్రీనివాస్, షోరూం మేనేజర్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

మోపెడ్ చోరీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి ముందు పెట్టిన మోపెడ్ చోరీకి గురైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట వాగు సెంటర్‌కు చెందిన కురెంద దావీదు కూలీ పనులు చేస్తుంటాడు. దావీదు తన అవసరాల కోసం టీవీఎస్ మోపెడ్‌ను కొనుగోలు చేశాడు. ఈ నెల 8న ఇంటికి వచ్చిన దావీదు తన మోపెడ్‌ను రోడ్డుపై పెట్టి తాళం వేశాడు. మరుసటి రోజు ఉదయం నిద్ర లేచి చూసే సరికి మోపెడ్ కనిపించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

తెలుగు సంస్కృతికి ప్రతీకలు ముగ్గులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): తెలుగు వారి సంస్కృతీ, సంప్రదాయాలకు ముగ్గులు ప్రతీకలుగా నిలుస్తాయని కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా వాసవి క్లబ్ విజయవాడ విద్యాధరపురం ఆధ్వర్యంలో విద్యాధరపురంలోని టీవీ కృష్ణారావు వీధిలో గురువారం నిర్వహించిన ముగ్గుల పోటీల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముగ్గుల పోటీలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన క్లబ్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మండాసంధ్య న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. కాగా ముగ్గుల పోటీలో 50 మంది మహిళలు పాల్గొనగా మొదటి బహుమతిని ఎం.సువర్ణ, రెండు, మూడు బహుమతులను వరుసగా ఎస్.అరుణ ప్రియ, బి.ప్రవల్లిక సాధించారు. అలాగే కన్సొలేషన్ బహుమతులతోపాటు పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులను అందచేశారు. కార్యక్రమాన్ని వాసవీ క్లబ్ విద్యాధరపురం అధ్యక్ష, కార్యదర్శులు వీ పూర్ణచంద్రరావు, కె.ప్రవీణ్‌కుమార్, కోశాధికారి ఎస్.పుల్లారావు. సభ్యులు నిర్వహించారు.

ఏడాదికి 12 వేల యూనిట్ల రక్తం సేకరణే లక్ష్యం

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏడాదికి 12 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.65 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన సంచార వైద్య వాహనాన్ని గాంధీనగర్‌లోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భవనం నుంచి కలెక్టర్ గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోగుల సౌకర్యార్థం విజయవాడ సూర్యారావుపేటలో రక్తనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రెడ్ క్రాస్ సేకరించిన రక్తాన్ని మాత్రమే రోగులకు వినియోగించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖను మరింత పటిష్ట పరచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తద్వారా రెడ్ క్రాస్ సేవలను రోగులకు చేరువ చేయాలన్నదే తన లక్ష్యం పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా యూత్ రెడ్ క్రాస్‌ను ప్రోత్సహించి ప్రతి కళాశాలలోనూ రక్తదాన శిబిరాలను నిర్వహిస్తామన్నారు. సంచార వైద్య వాహనం ద్వారా వైద్య బృందం జిల్లాలో పర్యటించి రోగులకు వైద్య సేవలు అందించడంతో పాటు దాతల నుంచి రక్తాన్ని సేకరిస్తామని చెప్పారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.సమరం, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఇళ్లా రవి, మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ టి.సునీత, రెడ్ క్లాస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం జగనన్నకు ధన్యవాదాలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు ధన్యవాదాలని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. విద్యాధరపురం 39, 44 డివిజన్ల పరిధిలో వార్డు సచివాలయాల కోసం నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్స్‌ను ఆయన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి గురువారం ప్రారంభించారు. వెలంపల్లి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు అరకొర సౌకర్యాలతో వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న వార్డు సచివాలయాలను ఇప్పుడు సకల సౌకర్యాలతో సొంత భవనాలలో ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆయా డివిజన్లలోని సచివాలయాలన్ని ఒకే చోట ఉండటం శుభపరిణామమన్నారు. కార్పొరేటర్లు గుడివాడ నరేంద్ర రాఘవ, మైలవరపు రత్నకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు, పోతిరెడ్డి సుబ్బారెడ్డి, కొత్తమాసు పిచ్చయ్య, బొండా సాంబశివరావు, రేలంగి బుజ్జి, పాశం శివ, డీపీ రెడ్డి, పి.ఈశ్వరి, బోర మల్లేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద


అంబేడ్కర్ హైస్కూల్‌లో నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు, ఉపాధ్యాయులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారత దేశ ఔన్నత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిన చైతన్యమూర్తి స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తిప్రదాత అని డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఆర్.సత్యనారాయణ పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో గురువారం గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ హైస్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. డాక్టర్ జీఎస్ సుబ్బారావు మాట్లాడుతూ 'ప్రయత్నించి ఓడిపోయినా పరవాలేదు కానీ ప్రయత్నం చేయటంలో మాత్రం ఓడిపోకు' అన్న స్వామి వివేకానంద మాటలను యువత స్ఫూర్తిగా తీసుకుని ముందడుగులు వేయాలని సూచించారు. సంఘం ఉపాధ్యక్షుడు ఆర్.గోపాలం, సెక్రటరీ ఎం.నరసింహారావు, ఉపాధ్యాయుడు రాంబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..

జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా గొల్లపూడి గ్రామంలోని మైలవరం నియోజకవర్గ శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గంగవరపు శివాజీ మాట్లాడుతూ.. తన ప్రసంగాలతో కోట్లాది మందిని చైతన్యవంతులను చేసిన మహనీయుడు స్వామి వివేకానంద అన్నారు.

వివేకానంద జీవితం ఆదర్శం కావాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): స్వామి వివేకానంద జీవితం నేటి తరానికి ఆదర్శం కావాలని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. కేబీఎన్ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను గురువారం ఆ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానందకు చిత్రపటానికి నివాళులర్పించారు. వివేకానంద చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని 'జాతీయ యువజన దినోత్సవం'గా 1984లో ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, ఎం.వెంకటేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.భాగ్యకుమార్, అకాడమిక్ డైరెక్టర్ రమేష్‌బాబు, అధ్యాపకులు డి.హేమచంద్రరావు, రవిబాబు, ఆఫీస్ మేనేజర్ ఏ పార్థసారథి, ఎస్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్.సాంబశివరావు, డి.పవన్‌కుమార్ పాల్గొన్నారు. మరో ప్రోగ్రామ్ ఆఫీసర్ వీఎస్ రావు కార్యక్రమాన్ని నిర్వహించారు.

వివాహిత అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వివాహిత అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గొల్లపూడి సారాకొట్టు సెంటర్‌కు చెందిన బుద్దుల నానిబాబు, అరుణ దంపతులు. నానిబాబు ఆటో డ్రైవర్‌గా, అరుణ క్రాస్ రోడ్ హోటల్‌లో పనిచేస్తోంది. ప్రతి రోజు మధ్యాహ్నం 3. 30 గంటలకు డ్యూటీకి వెళ్లి రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి వస్తుంది. బుధవారం ఉదయం 7.30 గంటల సమయంలో అరుణ భర్త నానిబాబు ఆటో నడిపేందుకు వెళ్లాడు. 10.30 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా భార్య కనిపించలేదు. చుట్టుపక్కల వారిని ఆరా తీశాడు. అయినప్పటికీ ఆమె ఆచూకీ దొరకలేదు. దీంతో భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గణతంత్ర పరేడ్‌కు తేజస్వీకి ఆహ్వానం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాకు చెందిన డాక్టర్ బాణావతు తేజస్వీకి న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలను భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో కలిసి వీక్షించే అవకాశం రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ఈ నేపథ్యంలో డాక్టర్ తేజస్వి గురువారం జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి బాక్స్ నుంచి గణతంత్ర వేడుకలను వీక్షించేందుకు 50 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. వీరిలో నగరంలోని గుణదల ఎన్టీఆర్ కాలనీకి చెందిన డాక్టర్ తేజస్విని ఎంపిక కావడం అభినందనీయమన్నారు. తేజస్వీ ఎంబీబీఎస్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి 6 గోల్డ్ మెడల్స్ అందుకున్నారని చెప్పారు. తండ్రి ప్రభుత్వ ఉద్యోగిగా, తల్లి సామాన్య గృహిణిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చి దిద్దారన్నారు. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు.

సృజనాత్మకతకు పదును పెట్టాలి


విద్యార్థినులతో మాట్లాడుతున్న కార్యదర్శి శ్రీనివాసు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమలోని సృజనాత్మకతను పదును పెట్టి నూతన ఆవిష్కరణలకు చొరవ చూపాలని కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాసు అన్నారు. ఆ కళాశాల కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో స్టార్టప్ బిజినెస్ ఐడియా ఎక్స్‌పోను గురువారం ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వివిధ వ్యాపార ఆలోచనలను ప్రదర్శిస్తూ వాటిలోని విశేషాలను వివరించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన తూనుకుంట్ల శ్రీనివాసు మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాల కోసం కాకుండా వాటిని సృష్టించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. పారిశ్రామికవేత్త డి.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో ముందడుగు వేస్తే అనేక అవకాశాలు వస్తాయన్నారు. మరో పారిశ్రామికవేత్త డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజంలో మారుతున్న పరిస్థితులను అవగాహన చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనలకు కళాశాల యజమాన్యం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు అధ్యాపకులు హేమంతకుమార్, వి.శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వివిధ పాఠశాలల్లో నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. విద్యార్థులు ఉత్సాహంతో డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. భవానీపురం క్రాంబ్వే రోడ్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో నిర్వహించిన సంబరాల్లో ముఖ్య అతిథిగా స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ టి.సుమన్ త్యాగరాజ్, ప్రిన్సిపాల్ కె.కల్యాణి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా నాటి సంప్రదాయాలను తలపించేలా ఏర్పాటు చేసిన గంగిరెద్దుల విన్యాసాలు, జంగమదేవరలు, భోగి మంటలు, బొమ్మల కొలువు, హరిదాసు సంకీర్తనలు చూపరులను ఆకట్టుకున్నాయి.

విద్యాధరపురం కేసీ హైస్కూల్‌లో..

విద్యాధరపురంలోని కేసీ హైస్కూల్‌లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు గుడివాడ నరేంద్ర రాఘవ, మైలవరపు రత్నకుమారి, పడిగపాటి చైతన్యరెడ్డి పాల్గొన్నారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి వారిని ఆశీర్వదించారు. సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల సంకీర్తనలు, బొమ్మల కొలువు అలరించాయి. భోగిమంటల చుట్టూ విద్యార్థినులు డ్యాన్స్ చేయగా కార్పొరేటర్లు వారితో కలిసి అడుగులు వేశారు. విద్యార్థుల కేరింతలతో స్కూల్ ప్రాంగణం కోలాహలంగా మారింది.

'బాబు విష కౌగిలికి చిక్కొద్దు'

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చంద్రబాబు విష కౌగిలిలోకి వెళ్లి మరోసారి మోసపోవద్దని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు జాతీయ కాపు సమాఖ్య జాతీయ అధ్యక్షులు నరహరిశెట్టి శ్రీహరి సూచించారు. చంద్రబాబుతో ఎన్నికలలో పొత్తు పెట్టుకొని పోటీ చేసిన ఏ రాజకీయ పార్టీని ఆయన తరువాత పట్టించుకోలేదని, ఆ పార్టీల వైపు కనీసం కన్నెత్తి చూడలేదని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ పాలనలోనే కాపులకు తీరని అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. నాటి వంగవీటి మోహనరంగా హత్య నుంచి ఇటీవల ముద్రగడ పద్మనాభం అవమానాల వరకూ టీడీపీ పాలనలోనే జరిగాయని అందరూ గుర్తించాలన్నారు. కాపులకు రాష్ట్ర చరిత్రలో ఏనాడు లేని విధంగా కాపులకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించిన ఘనత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని వివరించారు. నేడు కాపు జపం చేస్తున్న చంద్రబాబుకు గతంలో ఎందుకు గుర్తుకురాలేదని ప్రశ్నించారు. నేడు తమకులానికి ఏదో చేస్తామని భ్రమలో పెట్టే ప్రయత్నాలను కాపులు నమ్మే పరిస్థితి లేదని పేర్కొన్నారు.

శరవేగంగా అంబేడ్కర్ స్మృతివనం పనులు



నగరంలోని స్వరాజ్య మైదానంలో నిర్మిస్తున్న అంబేడ్కర్ స్మృతివనం పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీనిలో భాగంగా భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి ఏర్పాటు చేసే బూట్లు ఢిల్లీ నుంచి నగరానికి గురువారం చేరుకున్నాయి. సుమారు పది అడుగులకు పైగా ఎత్తుండే ఈ బూట్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

బ్రాహ్మణుల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం

భవానీపురం(విజయవాడపశ్చిమ): బ్రాహ్మణుల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. విద్యాధరపురం 39వ డివిజన్ పరిధిలోని కామకోటినగర్ శృంగేరి శారదా నగర్‌లో నూతనంగా నిర్మించిన రుగ్వేద యజుర్వేద స్మార్త పాఠశాల భవనం ఫస్ట్ ఫ్లోర్‌ను మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి గురువారం ప్రారంభించారు. అనంతరం వెలంపల్లి మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా, దేవదాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు నిధులు మంజూరు చేశానన్నారు. కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ, వేద పాఠశాల పురోహితులు కోట శ్రీరామచంద్రమూర్తి, ప్రతాప శ్రీనివాస శర్మ, నిమ్మగడ్డ పిచ్చయ్య శాస్త్రి, సుబ్రహ్మణ్య శర్మ, యనమండ్ర మల్లయ్య శాస్త్రి పాల్గొన్నారు.

రైల్వేలో పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వేలో నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఎంప్లాయీస్ సంఘ్ సీ అండ్ డబ్ల్యూ బ్రాంచ్ కార్యదర్శి కర్నూలు సుకుమార్ డిమాండ్ చేశారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే మెన్ ఇచ్చిన దేశవ్యాప్త నిరసన ప్రదర్శన పిలుపులో సీ అండ్ డబ్ల్యూ కోచింగ్ డిపోలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరిచుకోవాలని డిమాండ్ చేశారు. ఆలిండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఉద్యోగుల సంఘం అడిషనల్ డివిజనల్ కార్యదర్శి రాజీవ్, ఓబీసీ ఉద్యోగుల సంఘం అసిస్టెంట్ జనరల్ కార్యదర్శి చంద్రశేఖర్, బ్రాంచ్ చైర్మన్ వెంకటేశ్వరరావు, ఆఫీస్ బేరర్ మణికుమార్ ఉన్నారు.





నగరంలో సంక్రాంతి సందడి



నగరంలో సంక్రాంతి సందడి ప్రారంభమైంది. భవానీ ఐలాండ్‌తో పాటు నగర వ్యాప్తంగా నిర్వహిస్తున్న వేడుకలు ఆకట్టుకుంటున్నాయి. నిత్యం బిజీగా ఉండే యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.



పల్లెకు పయనం

సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రజలు పల్లె బాట పట్టడంతో విజయవాడ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లు ప్రయాణికులతో కిక్కిరిశాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.

